క్లుప్తంగా

విద్యార్థులకు నగదు బహుమతులు



విద్యార్థులకు నగదు అందిస్తున్న నిర్వాహకులు

రాపూరు: ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల్లో ఈ ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు శ్రీకిరెడ్డి రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు శశిధర్‌రెడ్డి సోమవారం నగదు బహుమతులను అందించారు. విద్యార్థి మహేష్‌కు రూ.10 వేలు, శ్రావణ్‌కు రూ.5వే లు, బాలికోన్నత పాఠశాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన అర్చనకు రూ.10 వేలు, జాస్మిన్‌కు రూ.5 వేలు అందించారు. హెచ్‌ఎంలు బాలసుబ్రమణ్యం, విజయకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

117 జీవోను రద్దు చేయాలి



విన్నతి పత్రం అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు

రాపూరు: ప్రభుత్వం 117 జీవోను రద్దు చేయాలని ఫ్యాప్టో నాయకులు సోమవారం ఎంఈఓలు శ్రీనివాసులు, జిలానిబాషాలకు వినతి పత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు మండల విద్యావనరుల కార్యాలయంలో విద్యాశాఖ అధికారులకు వినతి పత్రం అందించామన్నారు. అసంబద్ధమైన 117 జీవోను రద్దు చేయాలని, జీవో 53ని అనుసరించి ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ జరపాలని డిమాండ్ చేశారు. నాయకులు అక్రమ్, శ్రీనివాసులు, గౌస్ మొహిద్దీన్, బాలప్రసాద్,నయిముద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలు కొనసాగిద్దాం

గూడూరు రూరల్: భగత్ సింగ్ ఆశయాలను కొనసాగించేలా ప్రతి విద్యార్థి ముందుకు నడవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శశికుమార్ పిలుపునిచ్చారు. రెండవ పట్టణంలోని ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం ఏఐఎస్ఎఫ్ 89వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రమోద్, ప్రణయ్, సుమంత్, ముఖేష్, హారిక, రెడ్డమ్మ, జోత్స్న, లీలావతి, నందిని తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై డిప్యూటీ డీఈఓకు వినతి



వినతి పత్రాన్ని అందిస్తున్న ఉపాధ్యాయ నేతలు

నాయుడుపేట టౌన్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో గూడూరు డిప్యూటీ డీఈఓ శాంతికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు వినతి పత్రాన్ని అందించారు. పాఠశాల విద్య, పని సర్దుబాటు ప్రక్రియకు సంబంధించి ఉపాధ్యాయ సంఘాల సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయ సంఘ ఫ్యాప్టో నేతలు టి.గోవర్ధన్ రెడ్డి(యూటీఎఫ్), గడదాసు వెంకటేశ్వర్లు(ఆర్‌యూపీపీ), పేర్నాటి రామకృష్ణా, వెంకట్రావు(బీటీఏ), ఏపీటీఎఫ్ అల్లెయ్య, ఏపీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుందరమ్మ గ్రామోత్సవం

చిల్లకూరు: మండల కేంద్రమైన చిల్లకూరు దళితవాడకు చెందిన గ్రామ దేవత సుందరమ్మ గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకు కొనసాగించారు. గత మూడు రోజులుగా గ్రామ దేవత సుందరమ్మ ఆలయంలో పలు అభిషేకాలు నిర్వహించి హోమాలు చేపట్టారు. ఆదివారం ఉదయం గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టి ప్రసాదాలను పంచి పెట్టారు. రాత్రి అత్యంత వైభవంగా విద్యుత్ దీపాల వెలుగులో పూల అలంకరణల మధ్య అమ్మవారి ఉత్సవమూర్తిని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భేతాళ నృత్యాలు అందరినీ అలరించాయి.

సమన్వయంతో గ్రామాల అభివృద్ధి

వెంకటగిరి రూరల్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ తంబిరెడ్డి తనూజరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈఓపీఆర్డీ ఉమామహేశ్వరావు, ఏఓ విజయలక్ష్మి పాల్గొన్నారు. బాలాయపల్లి మండలంలోని స్త్రీశక్తిభవనంలో సోమవారం ఎంపీడీఓ అరుణ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు.

చిట్టమూరులో స్కౌట్ యూనిట్ ప్రారంభం

చిట్టమూరు(వాకాడు): జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం స్కౌట్ యూనిట్‌ను మండల విద్యాశాఖాధికారి ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ 32 మంది విద్యార్థులతో పాఠశాలలో స్కౌట్ యూనిట్‌ను ప్రారంభించామన్నారు. ఈ యూనిట్ స్కౌట్ మాస్టర్ పి.భరతమహిపతి ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు స్కౌట్ దుస్తులను ఎంఈఓ పంపిణీ చేశారు. మొక్కలు నాటారు. హెచ్‌ఎం గిరిబాబు, ఉపాధ్యాయులు చక్రవర్తి, వెంకటేశ్వరరావు, శీనయ్య, అపర్ణ పాల్గొన్నారు.

సేంద్రియం.. శ్రేయస్కరం

- విచ్చలవిడిగా పురుగుల మందుల వాడకం తగ్గించండి
- అతిగా వాడితే అనర్థాలు తప్పవు

సైదాపురం: అధిక దిగుబడుల కోసం విచక్షణారహితంగా రసాయనిక ఎరువుల వాడకంలో పంట దిగుబడి తగ్గిపోవడమే కాకుండా భూసారం కూడా క్షీణిస్తుంది. ఈ క్రమంలో రైతులు సేంద్రియ ఎరువులపై రైతులు దృష్టి సారించాలని సైదాపురం వ్యవసాయశాఖ ఏఓ పి.హైమావతి తెలిపారు. పశువుల ఎరువు, వర్మి కంపోస్టు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్ల ఎరువు, వేప, ఆముదం, చెరకు, కానుగ తదితరాల నుంచి విశేషంగా నేలకు, పంటలకు పోషకాలు లభిస్తాయి. వీటితోపాటు ఇతర పచ్చిరొట్ట పైర్లు నుంచి లభించే ఎరువులు పంటలకు వేయడంతో అధిక దిగుబడులు, నాణ్యమైన పంట ఉత్పత్తులు పొందవచ్చు. ఈ క్రమంలో సేంద్రియ ఎరువుల్లో ఉన్న పోషకాల శాతాన్ని తెలుసుకుని, వ్యవసాయ పంటలు, పండ్ల తోటలకు సిఫారసు చేసిన మోతాదుల్లో వివిధ దశల్లో సేంద్రియ ఎరువులు వాడితే రైతులకు పంట పెట్టుబడుల ఖర్చులు తగ్గి వ్యవసాయం లాభసాటిగా మారుతుంది. పంటలకు ప్రధానంగా నత్రజని, భాస్వరం, పొటాష్, పోషకాలు అవసరం ఉంటుంది. వాటిని తెలుసుకుని సేంద్రియ పోషకాలతో పాటు సిఫారసు చేసిన రసాయనిక ఎరువులు మాత్రమే వేసుకుంటే లాభాలు ఆర్జించవచ్చు.



సాగులో ఉన్న పచ్చిరొట్ట(జనుము)

సేంద్రియ ఎరువుల్లో లభించే పోషకాలు

ఎరువు పేరు	నత్రజని	భాస్వరం	పొటాష్
పశువుల ఎరువు	0.5-1.5	0.3-0.9	0.5-1.9
కోళ్ల ఎరువు	2.3-3.0	1.3-2.0	1-2
గొర్రెలు, మేకలు	0.2-0.7	0.4-0.6	0.1-3.0
వర్మి కంపోస్టు	1.5-3.0	1.05-2.2	1.1-1.75
చెరుకు మడ్డి	1.0-1.5	4.0-4.5	2.0-7.0
గోబర్ గ్యాస్‌ప్లాంట్(ఎరువు)	2.0-2.4.	1.5	1.0
గ్రామీణ కంపోస్టు	0.5-1.0	0.4-0.8	0.8-1.2
పట్టణ కంపోస్టు	0.7-1.0	0.9-3.3	1.0-2.0
పచ్చిరొట్ట పైర్లు	0.5-0.7	0.1-0.2	0.6-0.8
వేరుశనగ పిండి	6.5-7.5	1.3	1.5
వేప పిండి	5.2-5.6	1.1	1.5
ఆముదం పిండి	4.0-4.4	1.9	1.4
కానుగ పిండి	3.9-4.0	1.9-	1.4
చేపల పొట్టు	4-10	3-10	0.3-1.5
పత్తిగింజల పిండి	3.6	2.5	1.8
నువ్వుల పిండి	4.7-6.2	2.0	1.3
పంది ఎరువు	3.75	3.13	2.5
జనుము	0.75	0.12	0.51
అలసంద	0.71	0.15	0.58
పిల్లిపెసర	0.72	0.10	0.53

గురుకులంలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు

చిల్లకూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో చేరేందుకు అర్హత ఉన్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.అనీల్‌కుమార్ సోమవారం కోరారు. కళాశాలలో ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఇప్పటికే భర్తీ ప్రక్రియను పూర్తి చేశామని, అయితే 9 వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో కొన్ని ఖాళీలు ఉన్నందున వాటిని భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు గాను 9వ తరగతిలో రెండు సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 5 సీట్లు, బైపీసీలో 15 సీట్లు ఖాళీ ఉన్నాయని తెలిపారు. వీటిని భర్తీ చేసేందుకు 13వ తేదీ మంగళవారం సాయంత్రంలోగా గురుకుల కళాశాలలో దరఖాస్తులను అందించాలని అన్నారు.14వ తేదీన ప్రవేశం పరీక్ష నిర్వహిస్తామని అన్నారు. ఇంటర్లో ప్రవేశానికి 10వ తరగతిలోని మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామని ఆయన తెలిపారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



గాయపడిన ఆటో డ్రైవర్ సుబ్రహ్మణ్యంరెడ్డి, నవీన్

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని పండ్లూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం ఆర్టీసీ బస్సు ముందు వెళుతున్న ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్‌తో పాటు మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పెళ్లకూరు మండలం చిల్లకూరు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మారంరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, అదే గ్రామానికి చెందిన నవీన్‌తో కలిసి ఓజిలి సమీపంలో సిమెంట్ బ్రిక్స్ పరిశ్రమకు వెళ్లారు. అక్కడి నుంచి చిల్లకూరు గ్రామానికి ఆటోలో సిమెంట్ రాళ్లను తీసుకెళ్తున్నారు. మార్గమధ్యలో పండ్లూరు గ్రామ సమీపాన వెనుక నుంచి వస్తున్న చిత్తూరు-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొంది. ఆటో బోల్తా పడి ఆటో నడుపుతున్న సుబ్రహ్మణ్యంరెడ్డి, నవీన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని హైవే అంబులెన్స్ సిబ్బంది ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని జాతీయ రహదారిపై అడ్డంగా పడిఉన్న ఆటోతో పాటు సిమెంట్ రాళ్లను పక్కకు జరిపి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు

ఉచిత ఇసుకపై స్పష్టత ఇవ్వండి



గూడూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

చిల్లకూరు: ఉచిత ఇసుక విధానంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజా సంఘాలు నాయకులు డిమాండ్ చేశారు. గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం పలు ప్రజా సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తామని ప్రకటనలు చేసిందని, అయితే ఎక్కడా కూడా ఉచితంగా ఇసుక అందే పరిస్థితి లేదన్నారు. దీనిపై అధికారులను సంప్రదిస్తే పొంతనలేని సమాధానాలు ఇస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ఉచిత ఇసుక విధానంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉచితంగా ఇసుకను అందించి భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని కోరారు. అలాగే పేదలు నిర్మించుకునే ఇళ్లకు ఉచితంగా ఇసుకను అందించి ఆదుకోవాలని అన్నారు. ఏటి వద్దకు ఇసుక కోసం వెళితే రైతులు అడ్డుకుంటున్నారని ఏదో ఒక విధంగా వారికి నచ్చజెప్పి రోడ్డు ఎక్కితే పోలీసులు పట్టుకుంటున్నారని తెలిపారు. ఇలా అయితే భవ నిర్మాణ కార్మికులకు పనులు ఉండవని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గూడూరు తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందించారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ ఉచిత ఇసుకను అందించే ఏర్పాట్లు చేస్తున్నామని, ఎవరైనా ముందస్తుగా సమాచారం ఇచ్చి ఏటి ఇసుక తీసుకుని వచ్చే సమయంలో ఎవరైనా అడ్డుకుంటే తనకు ఫోన్ చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జోగి శివకుమార్, వీవీరమణయ్య, సురేష్, పట్టా శంకరయ్య, క్రిష్ణయ్య, అడపాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పనులు లేక అల్లాడుతున్నాం

- మైనింగ్ పరిశ్రమల్లోని కార్మికుల నిరసన



ఆందోళన చేస్తున్న మహిళా కార్మికులు

గూడూరు రూరల్: గత రెండు నెలలుగా పనులు లేక అల్లాడి పోతున్నామని చెన్నూరుకు చెందిన వంద మంది మైనింగ్ అనుబంధ పరిశ్రమల్లో పని చేసే కార్మికులు గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తరువాత పలు మైనింగ్ కార్యకలాపాలను నిలిపి వేయడంతో ఎక్కడా పని లేకుండా పోయిందన్నారు. గూడూరు ప్రాంతంలో దొరికే వర్మికులైట్ పరిశ్రమలలో చెన్నూరుకు చెందిన సుమారు 200 కుటుంబాలు ఆధారపడి జీవనం చేస్తున్నామని తెలిపారు. రెండు నెలల క్రితం వరకు ఆయా పరిశ్రమల్లో పనులు ఉండేవని తెలిపారు. ప్రస్తుతం ఎక్కడా తవ్వకాలు చేపట్టవద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. దీంతో పరిశ్రమ యజమానులు పనులు నిలిపి వేశారని దీంతో ముడి సరుకు అందక పనులకు రావద్దంటున్నారని పేర్కొన్నారు. ఆ పనులపైనే ఆధారపడి జీవనం చేసే కుటుంబాలవాళ్లంతా పస్తులతో కాలం గడపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసి ప్రజా విజ్ఞప్తుల వేదికలో గూడూరు తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందించారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళతామని అన్నారు.

బదిలీ అయిన ఎంపీడీఓలకు సన్మానం



దక్కిలి: ఎంపీడీఓ లీలా మాధవిని సన్మానిస్తున్న ఉద్యోగులు

దక్కిలి: తిరుపతి జిల్లాకు బదిలీ అయిన ఎంపీడీఓ లీలా మాధవిని సోమవారం కార్యాలయం సిబ్బంది, ఎంఈఓలు ఘనంగా సన్మానించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా దక్కిలి మండల పరిషత్‌కి బదిలీపై వచ్చిన ఎంపీడీఓ లీలా మాధవి ఆరు నెలలుగా పంచాయతీ పాలనలో శానిటేషన్, తాగునీరు తదితర అభివృద్ధి పనులు చేపట్టి మండల ప్రజల నుంచి మన్ననలు పొందారని ఉద్యోగులు తెలిపారు. ఎంపీపీ జి.రాజశేఖర్, ఎంఈఓలు వెంకటేశ్వర్లు, జగదీష్, సూపరింటెండెంట్ అనురాధ, ఈవోపీఆర్డీ అల్లాబక్షు, సీనియర్, జూనియర్ సహాయకులు సిరాజ్ ఉద్దీన్ ఖాద్రి, శరవణ, సిబ్బంది పాల్గొన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఈఓపీఆర్‌డీ భువనేశ్వర శర్మ బాధ్యతలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్, పంచాయతీ కార్యదర్శులు గోపాల్, గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్: నాయుడుపేట ఎంపీడీఓగా పనిచేస్తూ చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళుతున్న ఎ.ప్రేమ్‌రాజ్‌కుమార్‌ను సోమవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం ఆయన చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం

రాపూరులో...

రాపూరు: ఎంపీడీఓగా పనిచేస్తున్న గంగయ్యను చిత్తూరు జిల్లాకు బదిలీ చేయడంతో మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు



ఎంపీడీఓ గంగయ్యను సన్మానిస్తున్న ఉద్యోగులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాయుడుపేట టౌన్: నాయుడుపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి 11 గంటలకు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీ శేఖర్ తెలిపారు. నాయుడుపేట పట్టణంతోపాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విత్యుత్ అంతరాయం విషయమై వినియోగదారులు, రైతులు అధికారులకు సహకరించాలని కోరారు.

గూడలిలో వైద్య శిబిరం

కోట: మండలంలోని గూడలి గ్రామంలో సోమవారం స్విమ్స్ మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ ద్వారా ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్యశిబిరం ద్వారా పలువురికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గూడలి ఉపసర్పంచ్ పల్లెమల్లు విజయసారథిరెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగిస్తూ వైద్యపరీక్షలు నిర్వహించడం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ సెక్రటరీ కిరణ్ పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

చిల్లకూరు: మండల తీర ప్రాంతంలోని మోమిడి గ్రామంలో ఉన్న క్రీడా మైదానంలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం తీర ప్రాంతంలోని గమ్మళ్లదిబ్బ, వరగలి గ్రామాలకు చెందిన రెండు జట్లు తలపడ్డాయి. నిర్ణీత 15 ఓవర్లలో మొదటగా బ్యాటింగ్ చేపట్టిన గమ్మళ్లదిబ్బ యంగ్ బుల్లెట్స్ జట్టు 14 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 123 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వరగలి పాళెం జట్టు 13 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 127 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ పోటీలలో నిర్వాహకులు క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూశారు.

ఎస్‌ఎంసీ ఎన్నిక సజావుగా జరపాలి

కోట: గోవిందపల్లి జెడ్పీ హైస్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్ ఎన్నిక సజావుగా జరిగేలా చూడాలని కొత్తపట్నం సర్పంచ్ తిరుపాలయ్య, ఉపసర్పంచ్ ఉప్పల ప్రసాద్‌గౌడ్ సోమవారం తహసీల్దార్ జయజయరావుకు వినతిపత్రం అందజేశారు. 9వ తేదీన గోవిందపల్లి జెడ్పీ హైస్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్ ఎన్నిక సజావుగా జరుగుతున్నా ఉద్దేశపూర్వకంగానే కొందరు అధికారులను తప్పుదోవ పట్టించి వాయిదా వేయించడం జరిగిందన్నారు. ఈ నెల 17వ తేదీన ఎన్నిక నిర్వహించేందుకు సిద్ధమవుతున్న క్రమంలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని ఎన్నిక జరపాలని కోరారు.

రెవెన్యూ సదస్సులు 16నుండి ప్రారంభం

బాలాయపల్లి(సైదాపురం): రెవెన్యూ విభాగంలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారం దిశగా నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను ఈ నెల 16వ తేదీ నుండి ప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ ఏవీఆర్ ప్రసాద్ పేర్కొన్నారు. బాలాయపల్లి రెవన్యూ కార్యాలయంలో సోమవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలాయపల్లి మండల పరిధిలోని గ్రామాల్లో 45రోజులపాటు రెవెన్యూ సదస్సులు అధికారులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీల వెల్లువ



ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన వివిధ శాఖల అధికారులు

దొరవారిసత్రం: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్థానిక తహసీల్దార్ శైలకుమారి ఆధ్వర్యంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు సమస్యలపై అర్జీలు అందాయి. ఇందులో అధికంగా రెవెన్యూ పరమైన సమస్యలపై వినతులు అందినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. వివిధ శాఖల అధికారులు గోపినాథ్‌రెడ్డి, శ్రీదేవి, అంకమ్మ, జ్యోతిర్మయి, మోహన్, రామారావు, పద్మావతి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

వెంకటగిరి రూరల్: వార్డు పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కానాపిరి తన వంతు కృషి చేయనున్నట్లు 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య పేర్కొన్నారు. పట్టణంలోని సుదర్శనం నగర్‌లోని సచివాలయంలో సోమవారం ప్రజల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలోని ధర్మాపురం, నరసింహారావు, బొగ్గులమిట్ట ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించి, ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అధికారులు సకాలంలో స్పందించి డ్రైనేజీ కాలువలను శుభ్రపరచి, వీధిదీపాల ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

బూదూరు రైతుల ఆందోళన



డీవీ సత్రం తహీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన

దొరవారిసత్రం: ఓ టీడీపీ నాయకుడు, రియల్టర్ నకిలీ పత్రాలు సృష్టించి తమ భూములను రిజిస్ట్రేషన్ చేయించాడని, న్యాయం చేయాలని రైతులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం దొరవారి సత్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బూదూరు గ్రామానికి చెందిన 30 మంది రైతులు పత్రాలు చేతబట్టుకుని తమ భూములను తిరిగి ఇప్పించాలంటూ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ బూదూరు రెవెన్యూ గ్రూపు పరిధిలోని వివిధ సర్వే నంబర్లులోని 20ఎకరాలు పైగా పట్టా భూములను అదే ప్రాంతానికి చెందిన ఓ తెలుగు దేశం నాయకుడు, రియల్టర్ గతంలో రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి, నకిలీ పత్రాలను తయారు చేసి రైతులకు తెలియకుండానే రిజిస్ట్రేషన్లు చేశారన్నారు. ఈ భూములపై రెవెన్యూ అధికారులు ఒకటికి రెండు దఫాలు రెవెన్యూ కోర్టు నిర్వహించినప్పటికీ ఆక్రమణదారుడు రెవెన్యూ కోర్టుకు హాజరు కాకపోవడంతో సంబంధిత అధికారులు వాయిదాలు వేస్తున్నారని బాధిత రైతులు వాపోయారు. అనంతరం బాధిత రైతులు తహసీల్దార్ శైలకుమారి వినతిపత్రాన్ని అందజేశారు. బూదూరులోని భూ సమస్యను పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. భూసమస్య కారణంగా వివాదాలు జరిగే అవకాశం ఉందని ఎస్ఐ తిరుమలరావుకు రైతులు ఫిర్యాదు చేసి, రక్షణ కల్పించాలని కోరారు.

పంట దిగుబడి వరకు సమయం ఇవ్వండి



వినతి పత్రం అందిస్తున్న చింతవరం ఎస్టీ, బీసీలు

చిల్లకూరు: తాము సాగు చేసుకుంటున్న భూమిలో పంట దిగుబడి వచ్చేంత వరకు ఆగాలని చింతవరం గ్రామానికి చెందిన ఎస్టీ, బీసీలు తహసీల్దార్ శ్రీనివాసులుకు సోమవారం విన్నవించారు. మండలంలోని చింతవరం గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 366, 452, 474/2లలోని 6.38 ఎకరాల్లోని భూమిలో నాలుగేళ్లుగా వేరుశనగ సాగు చేసుకుంటున్నట్టు వారు తెలిపారు. అయితే ఆ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు. చింతవరం రెవెన్యూ పరిధిలోని ఆ భూమిలో ప్రస్తుతం రెండు నెలల పంట ఉన్నదని, ఈ సమయంలో గ్రామ రెవెన్యూ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారన్నారు. పంట దిగుబడి వచ్చే సమయం కావున ఇలా భూమిలోకి దిగకుండా చేస్తే పెట్టిన పెట్టుబడులు నష్ట పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. పంట దిగుబడి వచ్చే వరకు అనుమతులు మంజూరు చేయాలని వారు కోరారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తామని అన్నారు. మరో విషయంలో చింతవరం గ్రామ రెవెన్యూ పరిధిలో కొంత మంది ప్రభుత్వ భూములను సొంత చేసుకుంటున్నారని, దీనిపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోవాలని బీఎస్పీ నాయకులు గోను జయరామయ్య తహసీల్దార్ శ్రీనివాసులును కోరారు.

మెరుగైన గ్రామీణాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ



సర్పంచ్‌లకు శిక్షణ ఇస్తున్న ఈఓపీఆర్డీ మోహన్

సైదాపురం: మెరుగైన గ్రామీణాభివృద్ధి కోసమే సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శివకుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన సైదాపురం స్త్రీశక్తి కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులకు మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలను సోమవారం ప్రారంభించారు. సమావేశానికి ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో మంచి పరిపాలనను అందించాలనే ఉద్దేశంతో శిక్షణ తరగతులను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. తాగునీరు, వీధిదీపాల నిర్వహణ, గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చిత్తలూరు పోలయ్య, ఈఓపీఆర్డీ ఏడుకొండలు, శిక్షణ నిర్వాహకులు జిలానీ బేగ్ తదితరులున్నారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు విధి, విధానాలపై పంచాయతీ రాజ్ శాఖ అధికారులు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ తరగతులు మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివరాజు తెలిపారు. ఈ తరగతుల్లో ముఖ్యంగా గ్రామ పంచాయతీలో పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, అభివృద్ధిపై పరిశీలన, వీధి దీపాలు, విద్యుత్ బిల్లులు తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్స్ అవగాహన కల్పించారు. ఈ శిక్షణా తరగతుల్లో వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రమేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓజిలిలో...

ఓజిలి: పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఈఓపీఆర్డీ మోహన్ అన్నారు. మండల శ్రీశక్తిభవనంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు మొదటిరోజు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీల్లో కీలకమైన సర్పంచ్, కార్యదర్శులకు ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలను మూడు రోజులపాటు నిర్వహిస్తున్నారన్నారు. పంచాయతీలో అమలు చేయాల్సిన కార్యక్రమాలు, అభివృద్ధి ప్రణాళికలపై సూచనలు చేశారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ దీపాలు తదితర పనులను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు.

దక్కిలిలో..

దక్కిలి: సర్పంచ్‌లకు పంచాయతీ పాలనపై సమగ్ర అవగాహన ఉండాలని ఎంపీపీ గోను రాజశేఖర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు పలు అంశాలపై మొదటి రోజు శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఎంపీడీఓ లీలా మాధవి, ఈవోపీఆర్డీ అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్: పంచాయతీ రాజ్ చట్టం విధి విధానాలు తదితర అంశాలపై మండల పరిధిలోని సర్పంచ్‌లకు శిక్షణ తరగతులను నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి మూడు రోజలపాటు రిసోర్స్ పర్సన్‌లు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ ఎ.ప్రేమ్‌రాజ్‌కుమార్ వెల్లడించారు. రిసోర్స్ పర్సన్‌లుగా ఈఓపీఆర్‌డీ భువనేశ్వర శర్మ, పంచాయతీ కార్య దర్శులు ఎం.గోపాల్, సీహెచ్ గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.